RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:110

శుక్రవారం
ఏప్రిల్ 17, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

## నీ కొడుకు నీలా లేడు!

- స్నేహితులు వెక్కిరిస్తున్నారని కన్న తండ్రి దారుణం
- కన్నకొడుకునే కృష్ణా నదిలో తోసేసిన వైనం
- కోచింగ్ సెంటర్‌లో చేర్పిస్తానని తీసుకెళ్లి ఘాతుకం
- కర్ణాటకలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన హృదయ విదారక ఘటన

2లో

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

### మహిళ ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగిన బాధితురాలు
- మునగాల ప్రజాపాలనలో కలకలం
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ సమక్షంలోనే ఘటన
- రాజకీయ ఒత్తిళ్లతోనే అన్యాయం జరిగిందని ఆవేదన

2లో



## తెలంగాణలో ఏరోస్పేస్.. డిఫెన్స్ రంగాల విస్తరణ

- మంత్రి శ్రీధర్ బాబుతో యూఎస్ వార్ కాలేజీ బృందం భేటీ
- సచివాలయంలో పెట్టుబడి అవకాశాలపై ఉన్నత స్థాయి చర్చలు
- అమెరికా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి
- అంతర్జాతీయ రక్షణ రంగ హబ్‌గా మారుతున్న హైదరాబాద్

2లో






# మల్లన్న.. ఏందీ మాయ?

### కనపర్తి రైస్ మిల్లులో అంతులేని అక్రమాలు

- లక్ష క్వింటాళ్ల ధాన్యం గోల్‌మాల్
- పాతవి ఇవ్వరు.. కొత్తవి వాటినీ వదలరు
- అయినా మళ్లీ ధాన్యం కేటాయించిన అధికారులు
- రాష్ట్ర వ్యాప్తంగా ఎగవేత మిల్లులపై ప్రభుత్వం చర్యలు
- 'మల్లన్న'కు మాత్రం మినహాంపు ఎందుకో?
- అవినీతి అడ్డు లేకుండా అధికారులకు భారీగా ముడుపులు
- గోనె సంచుల లెక్కల్లోనూ అవకతవకలే..

2లో



## సీఎంఆర్ పేరిట ఓ రైస్ మిల్లర్ మాయాజాలం

## సుమారు రూ.80 కోట్ల వరకు ప్రభుత్వ సొమ్ము ఎగవేత

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు.. సీఎంఆర్ బియ్యం అప్పగింతలో కోట్ల రూపాయల గోల్‌మాల్.. తనిఖీలకు వచ్చే అధికారులకే బదిలీ వేటు వేయించే రాజకీయ అండదండలు.. ఇదీ హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం కనిపర్తిలోని ఓ రైస్ మిల్లు అక్రమ సామ్రాజ్యం తీరు! సుమారు రూ. 80 కోట్ల ప్రభుత్వ ధనాన్ని దిగమింగి, పాత బకాయిలు చెల్లించకుండానే మళ్లీ కొత్తగా ధాన్యం కేటాయింపులు పొందుతున్న సదరు మిల్లర్ ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. రెవెన్యూ రికవరీ యాక్ట్ తనను ఏమీ చేయలేదనే ధీమాతో ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న ఈ 'ఖతర్నాక్ మిల్లర్' చీకటి బాగోతంపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం..

# చారిత్రక ఘట్టం.. మహిళా బిల్లు

### ఈ క్రెడిట్ అందరిదీ..

- ఏకగ్రీవంగా మద్దతివ్వాలని పిలుపు
- విభజన రాజకీయాలు చేసే వారిని మహిళలు క్షమించరు..
- డీ లిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో కీలక చర్చ




**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజు చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర అత్యంత కీలకమని వివరించారు. గతంలో సాంకేతిక కారణాలు చూపి 30 ఏళ్ల పాటు

మిగతా 2వ పేజీలో

# లోక్‌సభ సీట్లు 815కు పెంపు

- మహిళా రిజర్వేషన్లపై మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కీలక ప్రకటన
- జనాభా లెక్కలు, డీలిమిటేషన్ తర్వాతే మహిళా కోటా అమలు
- మహిళలకు 272 సీట్లు కేటాయింపు.. రాష్ట్రాల ప్రాతినిధ్యానికి ఢోకా లేదు
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుతో మహిళా సాధికారతకు బాటలు



**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభలో డీలిమిటేషన్ మరియు మహిళా రిజర్వేషన్ బిల్లులపై జరిగిన చర్చలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచి, మొత్తం సీట్ల సంఖ్యను 815కు చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ విధానాన్ని, రాబోయే జనాభా లెక్కలు మరియు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ పూర్తయిన తర్వాతే పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు మంత్రి సభకు వివరించారు. లోక్‌సభ సామర్థ్యం 815 సీట్లకు పెరిగినప్పుడు,

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

శుక్రవారం | ఏప్రిల్ 17, 2026

# నీ కొడుకు నీలా లేడు!

- స్నేహితులు వెక్కిరిస్తున్నారని కన్న తండ్రి దారుణం
- కన్నకొడుకునే కృష్ణా నదిలో తోసేసిన వైనం
- కోచింగ్ సెంటర్‌లో చేర్పిస్తానని తీసుకెళ్లి ఘాతుకం
- కర్ణాటకలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన హృదయ విదారక ఘటన

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

మానవ సంబంధాలను మంటగలుపుతూ, స్నేహితుల వెక్కిరింతలకు ఒక కన్న తండ్రి తన ఆరేళ్ల కొడుకునే బలితీసుకున్న దారుణ ఘటన కర్ణాటకలో వెలుగు చూసింది. 'నీ కొడుకు నీలా లేడు.. ముఖం కూడా పోలిక లేదు..' అని స్నేహితులు చేస్తున్న ఎగతాళి మాటలను తట్టుకోలేక, తీవ్ర మనస్తాపానికి గురైన మల్లికార్జున అనే వ్యక్తి తన కన్నబిడ్డను కృష్ణా నదిలోకి తోసి హత్య చేశాడు. మార్చి 16న విజయపుర జిల్లా నాగథాన గ్రామంలో జరిగిన ఈ కిరాతక ఘటన, నిందితుడి నాటకీయ పరిణామాల తర్వాత ఆలస్యంగా బయటపడింది. స్నేహితుల అనాలోచిత మాటలు ఒక తండ్రిని హంతకుడిగా ఎలా మార్చాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. బాధితుడు మల్లికార్జున తన కుమారుడిని ఒక కోచింగ్ సెంటర్‌లో చేర్పిస్తానని ఇంట్లో వారిని నమ్మించి సిందగికి తీసుకెళ్లాడు. అయితే, అక్కడికి వెళ్లకుండా నేరుగా మహారాష్ట్రలోని సతారా జిల్లా కరాడ్ సమీపంలో ఉన్న కృష్ణా నది వద్దకు బాలుడిని తీసుకెళ్లాడు. పసివాడని కూడా చూడకుండా నేరుగా నదిలోకి తోసేసి, ఏమీ తెలియనట్లుగా తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఆ తర్వాత తన కొడుకు క్షేమంగానే ఉన్నాడని, కోచింగ్ సెంటర్‌లో బిజీగా ఉన్నాడని భార్యను, కుటుంబ సభ్యులను నమ్మిస్తూ కొన్నాళ్ల పాటు క్రూరమైన నాటకమాడాడు. కొడుకుతో మాట్లాడాలని భార్య భాగ్యశ్రీ కోరగా, మల్లికార్జున ఎవరో గుర్తు తెలియని వ్యక్తికి ఫోన్ చేసి మాట్లాడించాడు. ఆ వ్యక్తి కూడా 'నీ కొడుకు ఆడుకుంటూ బిజీగా ఉన్నాడు' అని చెప్పడంతో ఆమె అప్పట్లో నమ్మింది. ఏప్రిల్ 1న బాలుడి పుట్టినరోజు కావడంతో, మార్చి 31న కొడుకును చూడాలని ఆమె పట్టుబట్టింది. దీంతో భార్యను తీసుకుని సిందగి వెళ్లిన నిందితుడు, రోజంతా ఆమెను వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ కాలయాపన చేసి తిరిగి ఇంటికి తెచ్చాడు. అనుమానం వచ్చిన భాగ్యశ్రీ గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించగా, ఆ తర్వాత నిందితుడు 'కొడుకు గురించి మర్చిపో..' అని చెప్పి పరారయ్యాడు. మహారాష్ట్ర పోలీసులు కృష్ణా నదిలో లభ్యమైన ఒక గుర్తుతెలియని బాలుడి మృతదేహం ఫోటోను పేపర్‌లో ప్రకటనగా జారీ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ ఫోటోను చూసి గుర్తుపట్టిన భాగ్యశ్రీ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు మల్లికార్జునను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, స్నేహితుల వెక్కిరింతలు భరించలేకే తన కొడుకును నదిలోకి నెట్టి చంపేసినట్లు నిందితుడు నేరం అంగీకరించాడు. కన్నబిడ్డనే కాలయముడిలా మారి అంతం చేసిన తండ్రి తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన సమాజంలో పెరిగిపోతున్న అసహనానికి, విచక్షణారహిత ప్రవర్తనకు అద్దం పడుతోంది. ఎగతాళి చేసిన స్నేహితులపై ఆగ్రహం చూపాల్సింది పోయి, ఏ పాపం తెలియని పసివాడిని చంపేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నిందితుడు పోలీసుల కస్టడీలో ఉన్నాడు. భార్య భాగ్యశ్రీ, నానమ్మ సుమిత్ర తమ బిడ్డను తలచుకుని కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక చిన్న అపనమ్మకం, స్నేహితుల బాధ్యతారాహిత్యపు మాటలు ఒక పసి ప్రాణాన్ని బలిగొని, ఒక కుటుంబాన్ని చీకట్లోకి నెట్టేశాయి.

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

### కలెక్టర్, ఎస్పీ సమక్షంలోనే పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

**వేద న్యూస్, సూర్యాపేట**



సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ ఇతర ఉన్నతాధికారులు ప్రజల సమస్యలను వింటుండగానే, ఒక మహిళ అధికారుల ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది. ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక, నిరసనగా ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ హఠాత్పరిణామంతో ఒక్కసారిగా సభా ప్రాంగణమంతా గందరగోళం నెలకొంది. వివరాల్లోకి వెళితే, మునగాల మండలంలోని తాడ్వాయి గ్రామాన్ని అధికారులు ఇందిరమ్మ ఇళ్ల పైలట్ ప్రాజె కింద ఎంపిక చేశారు. ఈ పథకం కింద గ్రామానికి చెందిన సునీత అనే మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ప్రాథమికంగా సమాచారం అందింది. అయితే, అర్హురాలైన తన పేరును తొలగించి, ఆ ఇల్లును మరొకరికి కేటాయించారని సునీత ఆరోపించింది. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, నేరుగా జిల్లా కలెక్టర్ పాల్గొన్న సభలోనే తన నిరసనను వ్యక్తం చేస్తూ తనతో తెచ్చుకున్న పురుగుల మందును తాగింది. అధికారుల కళ్ల ముందే ఈ ఘటన జరగడంతో అంతా షాక్‌కు గురయ్యారు. సునీత పురుగుల మందు తాగిన వెంటనే అక్కడున్న పోలీసులు మరియు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

## తెలంగాణలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల విస్తరణ

**వేద న్యూస్, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో కీలక భేటీ జరిగింది. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో 'యూఎస్ నేషనల్ వార్ కాలేజీ' ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలు, ముఖ్యంగా ఏరోస్పేస్, డిఫెన్స్ స్పేస్ రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న పురోగతిని మంత్రి వారికి వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయని ఆయన ఈ బృందానికి తెలియజేశారు. ఈ సమావేశంలో ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అమెరికాకు చెందిన ప్రముఖ రక్షణ మరియు అంతరిక్ష రంగ పారిశ్రామికవేత్తలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని ఆయన యూఎస్ బృందాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, సింగిల్ విండో అనుమతులు మరియు నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత గురించి ఆయన సుదీర్ఘంగా చర్చించారు.

# మల్లన్న.. ఏందీ మాయ!

**సీఎంఆర్ పేరిట ఓ రైస్ మిల్లర్ మాయాజాలం**

**సుమారు రూ.80 కోట్ల వరకు ప్రభుత్వ సొమ్ము ఎగవేత**

### కనపర్తి రైస్ మిల్లులో అంతులేని అక్రమాలు

- లక్ష క్వింటాళ్ల ధాన్యం గోల్‌మాల్
- పాతవి ఇవ్వరు.. కొత్తవి వాటినీ వదలరు
- అయినా మళ్లీ ధాన్యం కేటాయించిన అధికారులు
- రాష్ట్ర వ్యాప్తంగా ఎగవేత మిల్లులపై ప్రభుత్వం చర్యలు
- 'మల్లన్న'కు మాత్రం మినహాంపు ఎందుకో?
- అవినీతి అడ్డు లేకుండా అధికారులకు భారీగా ముడుపులు
- గోనె సంచుల లెక్కల్లోనూ అవకతవకలే..



**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

మిల్లర్ల మాయాజాలం అంతా ఇంతా కాదు.. సీఎంఆర్ పేరిట కోట్లు కొల్లగొట్టి దర్జాగా తిరుగుతున్నారు కొందరు మిల్లర్లు. అంతేకాదు.. పాత బకాయిలు చెల్లించకుండానే మళ్లీ అదే మిల్లుకు ధాన్యం కేటాయించుకొని మళ్లీ పెద్ద మొత్తంలో ప్రభుత్వ సొమ్మును ఎగ్గొంటేందుక ఎత్తుగడలు వేస్తున్నారు. హన్మకొండ జిల్లాలోని కమలాపూర్ మండలం కనపర్తి గ్రామంలో ఉన్న ఓ రైస్ మిల్లు ఇప్పుడు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రభుత్వం నుంచి వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి, తిరిగి బియ్యం ఇవ్వకుండా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని యజమాని దిగమింగుతున్నాడు. సుమారు రూ. 80 కోట్ల మేర ప్రభుత్వానికి బాకీ ఉన్నా, యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక భారీ స్థాయిలో కాసుల బేరం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### పాత బాకీ తీర్చకముందే..

మిల్లులో నిల్వలు ఏమయ్యాయో తెలీదు.. పాత బియ్యం లెక్కలు తేలలేదు.. కానీ అధికారుల ఆశీస్సులు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం బ్లాక్ లిస్టులో పెట్టాల్సిన ఈ మిల్లుకు, తాజాగా మళ్లీ ధాన్యం కేటాయించడం విస్తుగొలిపే అంశం. ప్రతిరోజూ వరుస కడుతున్న వాహనాలే దీనికి నిదర్శనం. గత లెక్కలు తేల్చకుండానే, ప్రస్తుతం కూడా సుమారు ట్రక్కుల్లో ధాన్యం మిల్లుకు దిగుమతి కావడం చూస్తుంటే, నిబంధనలను ఎంతలా తుంగలో తొక్కారో అర్థమవుతోంది.

### మిల్లు యజమాని ఖతర్నాక్ ప్లాన్!

సాధారణంగా ఒక్కో ఏసీకే కింద 430 క్వింటాళ్ల వరకు వడ్లు దిగుమతి అవుతాయి. ఇలాంటివి సుమారు 200 ఏసీకేలు, అంటే లక్ష క్వింటాళ్లకు పైగా ధాన్యం ఈ మిల్లుకు చేరింది. అయితే, ఇందులో మెజారిటీ ధాన్యం మిల్లులో ఉండాల్సింది పోయి, రాత్రికి రాత్రే బయట మార్కెట్‌కు తరలిపోతున్నట్లు సమాచారం. చివరికి గోనె సంచుల విషయంలో కూడా లక్షల రూపాయల గోల్‌మాల్ జరుగుతోందని, లెక్కల్లో చూపించే సంచులకు, మిల్లులో ఉన్న వాటికి అస్సలు పొంతన లేదని తెలుస్తోంది.

### అధికారుల బదిలీలే అస్త్రం..


ఈ మిల్లు యజమాని రాజకీయ పలుకుబడి బాగా ఉందని జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఈ మిల్లుపై తనిఖీలు చేసి, అక్రమాలను వెలికితీసే ప్రయత్నం చేసిన ఒక జాయింట్ కలెక్టర్ ను సైతం తన పొలిటికల్ బ్యాగ్రౌండ్‌తో బదిలీ చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. తప్పును ప్రశ్నించే అధికారులను సాగనంపుతూ, సహకరించే అధికారులకు ముడుపులు చెల్లిస్తూ ఈ అక్రమ సామ్రాజ్యాన్ని ఏలుతున్నాడు. రెవెన్యూ రికవరీ యాక్ట్ తనను ఏమీ చేయలేదన్న ధీమా సదరు యజమానిలో కనిపిస్తోంది.

### సీజ్ చేయాలని ప్రజల డిమాండ్

కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని అప్పనంగా తింటున్న ఈ మిల్లుపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అక్రమంగా కేటాయించిన ధాన్యాన్ని వెనక్కి తీసుకోవడమే కాకుండా, తక్షణమే మిల్లును సీజ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ ఖజానాకు మరిన్ని కోట్లు గండి పడటం ఖాయమని మేధావులు హెచ్చరిస్తున్నారు.

# వైద్యం పేరిట దోపిడీ!

## పేదల ప్రాణాలతో కమీషన్ల దందా




**వేద న్యూస్, కరీంనగర్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పల్లెల్లో వైద్యం వ్యాపారంగా మారింది. అమాయక ప్రజల ఆరోగ్య భయాన్ని ఆసరాగా చేసుకుని కొందరు గ్రామీణ వైద్యులు, ప్రైవేట్ ఆస్పత్రులు కుమ్మక్కై సాగిస్తున్న కమీషన్ దందా పేదల నడ్డి విరుస్తోంది. చిన్నపాటి జ్వరానికే పెద్ద జబ్బుగా భ్రమ కల్పించి, పట్టణాల్లోని ఆస్పత్రులకు రోగులను తరలించి లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు.

### భయపెట్టడమే మొదటి అస్త్రం

గ్రామాల్లో ఎవరికైనా చిన్న అనారోగ్యం వస్తే చాలు.. మొదట కొన్ని ఇంజెక్షన్లతో హడావిడి చేయడం, ఆపై పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులను భయపెట్టడం ఈ దందాలో మొదటి అంకం. ఇక్కడ చికిత్స కుదరదు.. తక్షణమే టౌన్ కి తీసుకెళ్లాలి అంటూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ముందే కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం, నిర్దిష్ట ప్రైవేట్ ఆస్పత్రులకే పేషెంట్లను రెఫర్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

### టెస్టుల పేరుతో అడ్డగోలు దోపిడీ!

రోగి ఆస్పత్రి గడప తొక్కకముందే ఆర్‌ఎంపీల నుంచి ఆస్పత్రులకు సమాచారం అందుతోంది. అక్కడకు వెళ్లగానే విఐపి ట్రీట్మెంట్ ఇస్తున్నట్లు నటిస్తూ, అవసరం లేకపోయినా వరుసగా స్కానింగ్‌లు, ల్యాబ్ టెస్టులు రాస్తున్నారు. ఒక్కో టెస్టులోనూ, ఒక్కో బెడ్ ఛార్జీలోనూ ఆర్‌ఎంపీలకు వాటాలు అందుతున్నాయి. ప్రతి పేషెంట్‌ను ఒక డీల్ గా భావిస్తున్నారే తప్ప, ప్రాణం విలువను ఎవరూ పట్టించుకోవడం లేదు.

### మందుల షాపులతోనూ ముఠా కట్టారు!

దోపిడీ కేవలం ఆస్పత్రితోనే ఆగడం లేదు. ఈ మందులు ఇక్కడే కొనాలి.. బయట దొరకవు అంటూ రోగులపై ఒత్తిడి తెస్తున్నారు. మెడికల్ షాపులు, డయాగ్నస్టిక్ సెంటర్లతో ఒక చైన్ గా ఏర్పడి, అధిక ధరలకు మందులు విక్రయిస్తూ సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నారు. చిన్న జబ్బుకు సైతం వేలల్లో ఖర్చు చేయిస్తూ పల్లె వాసులను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారు.

- ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాపుల బంధం
- అనారోగ్యం చిన్నది.. బిల్లు పెద్దది
- ప్రాణభయాన్ని పెట్టుబడిగా మార్చుకుంటున్న కేటుగాళ్లు
- ఒప్పందం చేసుకున్న ఆస్పత్రులకే రోగుల తరలింపు
- అవసరం లేకపోయినా స్కాన్లు, ల్యాబ్ టెస్టుల పేరిట దోపిడీ
- ఆర్థికంగా కుదేలవుతున్న నిరుపేద గ్రామీణులు

### పర్యవేక్షణ కరువు.. చర్యలేవి?

ఈ వ్యవస్థలో బలైపోతున్నది పేద ప్రజలే. ఒక చిన్న జబ్బు పల్లెటూరి కుటుంబాలను ఆర్థికంగా కుదేలు చేస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల పర్యవేక్షణ కరువైందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి, ఈ 'కమిషన్ మాఫియా'పై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామీణ వైద్య వ్యవస్థను దోపిడీ కేంద్రాలుగా మారకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## చారిత్రక ఘట్టం.. మహిళా బిల్లు

**మొదటి పేజీ తరువాయి**

ఈ బిల్లును అడ్డుకున్నారని, ఇప్పుడు అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో మద్దతు ఇచ్చి మహిళా సాధికారతకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలోని మహిళలు ఎప్పటికీ క్షమించరని ప్రధాని హెచ్చరించారు. గతంలో ఈ హక్కును ఎవరైతే అడ్డుకున్నారో, వారి పరిస్థితిని ఎన్నికల్లో మహిళలు అధ్వాన్నంగా మార్చారని గుర్తుచేశారు. ఒక మిత్రుడిగా సలహా ఇస్తున్నాను.. కేవలం రాజకీయ కోణంలోనే ఆలోచించకండి. అందరం కలిసి ఈ నిర్ణయం తీసుకుంటే అది ఏ ఒక్క పార్టీ విజయం కాకుండా దేశ ప్రజాస్వామ్యానికే గొప్ప విజయంగా మారుతుంది అని మోదీ పేర్కొన్నారు. మహిళా బిల్లు క్రెడిట్ తమకు మాత్రమే కాదని, దీనికి సహకరించే అన్ని పార్టీలకు దక్కుతుందని, కావాలంటే అందరి నేతల ఫోటోలు వేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై వస్తున్న ఆందోళనలను ప్రధాని ఈ సందర్భంగా పటాపంచలు చేశారు. మహిళా బిల్లు సాకుతో కొందరు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన పార్లమెంట్ సాక్షిగా తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వానికి చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు లేవని, సమాఖ్య స్ఫూర్తితోనే ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని, ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని తాను వాగ్దానం చేస్తున్నట్లు ప్రధాని హామీ ఇచ్చారు.

## లోక్‌సభ సీట్లు 815కు పెంపు

**మొదటి పేజీ తరువాయి**

అందులో 33 శాతం కోటా ప్రకారం మహిళలకు 272 సీట్లు లభిస్తాయని మంత్రి లెక్కలతో సహా వివరించారు. ఈ ప్రక్రియ వల్ల ఏ రాష్ట్రం కూడా తన ప్రస్తుత ప్రాతినిధ్యాన్ని కోల్పోదని, అన్ని రాష్ట్రాల సామర్థ్యం యథాతథంగా కొనసాగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. నియోజకవర్గాల పెంపు వల్ల పురుష సభ్యులకు కానీ, రాష్ట్రాలకు కానీ ఎటువంటి నష్టం వాటిల్లదని, ఇది కేవలం ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రక్రియ అని పేర్కొన్నారు. 131వ రాజ్యాంగ సవరణ 2026 బిల్లు ద్వారా మహిళలకు రాజకీయాల్లో సమానత్వం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చర్చను ప్రారంభించిన మంత్రి తన ప్రసంగంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను గుర్తు చేసుకున్నారు. ఒక సమాజం ఎంత ప్రగతి సాధించిందో ఆ సమాజంలోని మహిళలు సాధించిన పురోగతి ఆధారంగానే అంచనా వేస్తామన్న అంబేద్కర్ వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల అంశాన్ని బలంగా సమర్థించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం మాటలను కూడా ప్రస్తావించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చే రోజులు వస్తాయని, అయితే దానికి కొంత సమయం పడుతుందని కలాం ఆనాడే చెప్పారని, ప్రధాని మోదీ నేతృత్వంలో ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైందని మంత్రి పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చరిత్రాత్మక అడుగులు వేస్తోందని మంత్రి అభివర్ణించారు. ఈ బిల్లుల ద్వారా మహిళలకు చట్టసభల్లో నిర్ణయాత్మక పాత్ర లభిస్తుందని, ఇది దేశ ప్రజాస్వామ్య చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని చెప్పారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 17, 2026

## బిల్లులు రాలేదని పాఠశాలకు తాళం

**- మాజీ సర్పంచ్ నిరసన.. వల్లంపట్లలో ఉద్రిక్తత**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ వెంకటనర్సింహారెడ్డి ప్రభుత్వ పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గతంలో పాఠశాలలో రెండు తరగతి గదులు, డైనింగ్ హాల్ నిర్మాణానికి సుమారు రూ.22 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. పలుమార్లు అధికారులను సంప్రదించినా స్పందన లేకపోవడంతో ఈ చర్యకు దిగినట్లు చెప్పారు. సొంత నిధులతో పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**- వడ్డేపల్లి చెరువులో విషాద ఘటన**



**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట పట్టణం ఫాతిమా నగర్ సమీపంలోని వడ్డేపల్లి చెరువులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం సుమారు 4:40 గంటల సమయంలో కల్లెబోయిన క్రాంతి కుమార్ చేపల వేటకు వెళ్లి జారిపడి చెరువులో పడిపోయాడని తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం శోధన చర్యలు చేపట్టింది. గురువారం ఉదయం సుమారు 11 గంటలకు మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది.

## శ్వేతార్క గణపతి 28వ వసంతోత్సవాలు ప్రారంభం

**- ఐదు రోజులపాటు భక్తి శ్రద్ధలతో వేడుకలు**
**- వివిధ పూజలు, హోమాలు, ఊరేగింపులు**



**వేద న్యూస్, కాజీపేట:**

హనుమకొండ జిల్లా కాజీపేటలోని శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో స్వామివారి 28వ వసంతోత్సవాలు ఈ నెల 20 నుంచి 24 వరకు ఐదు రోజులపాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్ల శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20వ తేదీ గణపతి పూజ, అంకురార్పణ, హోమ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రతిరోజు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 21వ తేదీ స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లక్ష పుష్పార్చన, 22న చండీ హోమం, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న లలితా మహాయాగం, 24న పూర్ణాహుతి, అనంతరం కళ్యాణ మహోత్సవం జరగనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డికి జంగా శుభాకాంక్షలు

**- రాజ్యసభ సభ్యుడిని కలిసిన రాఘవరెడ్డి**



**వేద న్యూస్, కాజీపేట:**

న్యూ ఢిల్లీలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్రానికి చెందిన మంత్రులు, సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు.

# రెచ్చిపోయిన ఇసుక మాఫియా

- ☐ తహసీల్దార్‌పై ట్రాక్టర్‌తో హత్యాయత్నం
- ☐ అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్నందుకు దాడి
- ☐ తృటిలో తప్పిన ప్రాణాపాయం
- ☐ ఇసుక మాఫియా ఆగడాలపై ఆగ్రహం




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలు మరింతగా పెరిగాయి. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న తహసీల్దార్ మహేష్‌పై హత్యాయత్నం జరిగిన ఘటన కలకలం రేపుతోంది. బాధ్యతాయుతమైన అధికారిపైనే ఈ స్థాయిలో దాడి జరగడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నమ్మదగిన సమాచారం మేరకు క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లిన ఎమ్మార్వో మహేష్‌కు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ఎదురైంది. తన విధుల ప్రకారం ట్రాక్టర్‌ను ఆపాలని డ్రైవర్‌ను హెచ్చరించారు. అయితే డ్రైవర్ శివాజీ ట్రాక్టర్‌ను ఆపకుండా నేరుగా మహేష్‌పైకి దూసుకెళ్లి తొక్కించేందుకు యత్నించాడు. సమయస్ఫూర్తితో మహేష్ పక్కకు తప్పుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. జిల్లా కేంద్రంలోనే ఉన్నతాధికారిపై ఈ విధంగా దాడి జరగడం సంచలనంగా మారింది. డ్రైవర్ చర్య వెనుక ఇసుక మాఫియా పెద్దల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ కల్పించాల్సిన అధికార యంత్రాంగంపైనే దాడులు జరుగుతుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మహేష్ వెంటనే పోలీసులను ఆశ్రయించారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సిరిసిల్ల టౌన్ పోలీసులు డ్రైవర్ శివాజీపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది. ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి.

# రేపు హిందూ ధర్మ సమ్మేళనం

**- మడికొండ మెట్టుగుట్టలో ఏర్పాట్లు పూర్తి**
**- కుటుంబ సమేతంగా పాల్గొనాలని ఆహ్వానం**



**వేద న్యూస్, కాజీపేట:**

మడికొండ, బాపూజీ నగర్, బస్తీల హిందూ ధర్మ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో 18వ తేదీ శనివారం ఉదయం 8:30 గంటలకు మడికొండ శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానం మెట్టుగుట్ట ప్రాంగణంలో హిందూ ధర్మ సమ్మేళనం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు దొంతుల ప్రవీణ్ కుమార్ తెలిపారు. కాజీపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి చిగురుపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందూ సమాజంలో ఏకాత్మక భావన, స్వధర్మంపై అంకిత భావం, సేవాగుణాన్ని పెంపొందించేందుకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవాడ చిదానంద ఆశ్రమం శ్రీ భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ ముఖ్య అతిథిగా, ధర్మ జాగరణ అఖిల భారతీయ సహ ప్రముఖ్ ఏలే శ్యాం కుమార్ ప్రధాన వక్తగా, కాజీపేట ప్రభుత్వ ఐటీఐ ఏటీఓ చేపూరి వసుంధర ప్రత్యేక అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమ్మేళనంలో పేరిణి నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. అలాగే స్వామివారి తీర్థ ప్రసాదం, కళ్యాణ తలంబ్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. హాజరయ్యే భక్తుల కోసం టిఫిన్, భోజన వసతి, చలువ పందిళ్లు వంటి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. హిందూ బంధువులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సమితి సహ కార్యదర్శి నరేందర్, సభ్యులు పొనగోటి వెంకటరావు, చిర్ర రమేష్, పల్లపు కుమార్ స్వామి, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఒకే వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులు

**- 41 పంచాయతీల సమస్యలపై సమగ్ర చర్చ**
**- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై సమీక్ష సమావేశం**
**- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ**



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండల పరిధిలోని వైయస్సార్ గార్డెన్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సమీక్ష సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమై గ్రామ స్థాయి సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశానికి ఎమ్మార్వో ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పొన్నూరు శ్రీనివాసరావు, ఎంఈవో దుగ్గిరాల జయరాజు, ఏఓ భట్టు అశోక్ కుమార్, డాక్టర్ మోహన్, వెలుగు అధికారి పీడమర్తి వెంకటేశ్వర్లు, దయామణి తదితరులు హాజరయ్యారు. మండలంలోని అన్ని శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు అందుతున్న సేవలపై విశ్లేషణ చేపట్టారు. ముఖ్యంగా మండలంలోని 41 గ్రామపంచాయతీల సమస్యలను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ వివరించారు. తాగునీటి కొరత, రోడ్ల దుస్థితి, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్య సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై స్పందించిన అధికారులు వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాఖల మధ్య సమన్వయం పెంచి గ్రామాలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ ప్రణాళిక అమలు కావాలని ప్రజాప్రతినిధులు కోరగా, ఈ సమావేశం ప్రజల్లో ఆశాజనక వాతావరణాన్ని నెలకొల్పింది.

# అయోధ్యపురంలో బడిబాట




**- ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు అవగాహన**

**వేద న్యూస్, అయోధ్యపురం:**

అయోధ్యపురం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరానికి బడిఈడు పిల్లల వివరాలను సేకరించి నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మన్నె చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి అనుకూల వాతావరణం ఉంటుందని తెలిపారు. ఆటపాటలతో కూడిన ఒత్తిడిలేని విద్య ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాంలతో పాటు విద్యాసామాగ్రి అందజేస్తామని చెప్పారు. అలాగే పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, బ్రేక్‌ఫాస్ట్, పాలు వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించే కేంద్రాలుగా ఉన్నాయని పేర్కొంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారదాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 17, 2026

# 'పందుల ఫామ్' లొల్లి!

- గుంపెళ్ళగూడెంలో ఉద్రిక్తత
- గ్రామ ఆరోగ్యానికి ముప్పుగా మారిన పరిస్థితి
- మూడో నోటీసు ఇచ్చినా యజమాని నిర్లక్ష్యం
- తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గుంపెళ్ళగూడెం గ్రామంలో పందుల ఫామ్ వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. గ్రామ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన ఈ ఫామ్‌పై అధికార యంత్రాంగం ఇప్పటికే మూడోసారి నోటీసు జారీ చేసినప్పటికీ యజమాని స్పందించకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. పందుల ఫామ్ కారణంగా గ్రామంలో తీవ్ర దుర్వాసన వ్యాపించి పరిశుభ్రత దెబ్బతింటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలు, జ్వరాలతో బాధపడుతున్నారని, రోజువారీ జీవనం కష్టసాధ్యంగా మారిందని తెలిపారు. పలుమార్లు




ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సర్పంచ్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ శంకర్ కలిసి ఫామ్ యజమానికి మూడోసారి నోటీసు అందజేశారు. గ్రామ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించినప్పటికీ యజమాని వైఖరిలో మార్పు లేదని తెలిపారు. 'మా ప్రాణాలతో ఆటలాడే పరిస్థితిని ఇక సహించం. వెంటనే ఫామ్‌ను మూసివేయాలి. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం' అంటూ గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. అవసరమైతే రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేయడానికి సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ బాధ్యతగా పేర్కొంటూ సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఫామ్‌ను మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ జాగృతిలో చేరికలు



- కండువా కప్పి ఆహ్వానించిన కవిత

**వేద న్యూస్, గంగాధర:**

హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పలువురు నాయకులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్ కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ మ్యాక వినోద్‌తో పాటు గంగాధర మోహన్, గంగాధర మనోజ్, సుంకేపాక రమేష్, సుంకేపాక కిరణ్ తదితరులు పార్టీలో చేరారు. కవిత మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం సాధనలో జాగృతి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు ప్రజాసేవను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొత్తగా చేరిన వారికి అభినందనలు తెలిపారు.

# సింగరేణి జీపీకి బకాయిల చెల్లింపులు

- దేవస్థానం నుంచి రూ.1 లక్ష చెక్కు అందజేత
- మిగిలిన మొత్తాన్ని త్వరలో చెల్లిస్తామని హామీ



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కారేపల్లి సంతకు సంబంధించిన గ్రామపంచాయతీ బకాయిల చెల్లింపులు ప్రారంభమయ్యాయి. మొత్తం రూ.2 లక్షల బకాయిలో భాగంగా మొదటి దఫాగా రూ.1 లక్షను చెక్కు రూపంలో గ్రామపంచాయతీకి అందజేశారు. దేవస్థానం ప్రతినిధి మూడ్ మోహన్ చౌహన్ ఈ చెక్కును సర్పంచ్ మేదరి వీరప్రతాప్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూకు అందజేశారు. మిగిలిన బకాయిలను కూడా త్వరలో చెల్లిస్తామని ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి నిధులు సమయానికి అందడం ముఖ్యమని, మిగిలిన మొత్తాన్ని త్వరగా విడుదల చేయాలని కోరారు. ఈ నిధులను గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. దేవస్థానం బకాయిల చెల్లింపును గ్రామస్తులు స్వాగతిస్తూ, మిగిలిన మొత్తం త్వరగా చెల్లించాలని కోరుతున్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు

- భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- కూసుమంచిలో పైలట్ ప్రాజెక్ట్ అమలుపై సమీక్ష



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ప్రజలకు పారదర్శకంగా, సులభతరంగా సేవలు అందించడంతో పాటు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కూసుమంచి మండల తహసీల్దారు కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ అమలుపై రెవెన్యూ, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ భూ భారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైతులు ఇంటి వద్ద నుంచే స్లాట్ బుకింగ్ చేసుకుని, భూముల సర్వేకు దరఖాస్తు చేసుకునే విధంగా పోర్టల్ రూపొందించామని చెప్పారు. దరఖాస్తు నుంచి సర్వే పూర్తి వరకు ప్రతి దశలో మొబైల్ ద్వారా సమాచారం అందే విధానం కల్పించామని వివరించారు. సర్వే అనంతరం యూనిక్ భూధార్ నంబర్‌తో మ్యాప్‌ను పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూ భారతి కింద ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, తహసీల్దారు సైదులు, భూ భారతి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల హుండీ ఆదాయం రూ.52.12 లక్షలు

**వేద న్యూస్, పాపన్నపేట:**

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గ మాత ఆలయ హుండీ లెక్కింపులో రూ.52,12,171 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మఠం వీరేశం, దేవదాయ శాఖ మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్ రంగారావు తెలిపారు. గురువారం గోకుల్ షెడ్‌లో నిర్వహించిన హుండీ లెక్కింపులో మెదక్ ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. 56 రోజుల వ్యవధిలో ఈ ఆదాయం నమోదైంది. అదేవిధంగా మిశ్రమ బంగారం 24 గ్రాములు, మిశ్రమ వెండి 927 గ్రాములు లభించాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి పరామర్శ



- సీపీఎం నాయకుల నివాళి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ముదిగొండ మండలంలోని అమ్మపేట గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సానుభూతిపరుడు కోయ శ్రీనివాసరావు ఇటీవల మరణించగా, ఆయన దశదిన కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, సీఐటీయూ మండల కార్యదర్శి కళ్యాణ్ పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బంక మల్లయ్య, గ్రామ కార్యదర్శి వడ్డెల్లి కిరణ్, కోయ రామ్‌కిషోర్, నంబూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఊటుకూరి గోపయ్య తదితరులు హాజరై కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# అభివృద్ధికి సమన్వయం అవసరం

- అధికారులు, సర్పంచులు కలిసికట్టుగా పనిచేయాలి
- రోడ్డు భద్రతపై అవగాహన పెంపు అవసరం




**వేద న్యూస్, పాపన్నపేట:**

గ్రామాల అభివృద్ధికి అధికారులు, నూతన సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని డీఎల్‌పీవో సురేష్‌బాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సర్పంచులు అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు వెల్లడించారు. అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఎస్సై శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సర్పంచులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు నీరుడి వెంకటేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచ్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం

## – గొల్లపల్లిలో ఎగిసిపడిన మంటలు అదుపులోకి..



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో సంభవించబోయిన భారీ ప్రమాదం సర్పంచ్ సమయస్ఫూర్తితో తప్పింది. గంగమ్మ గుడికి ఎదురుగా ఉన్న చెత్తాచెదారానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి.వేసవి తీవ్రత కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీప ఇళ్లకు, వడ్ల కల్లానికి ప్రమాదం ఏర్పడింది. స్థానికులు వెంటనే సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌కు సమాచారం అందించారు.సర్పంచ్ వెంటనే స్పందించి తన ట్యాంకర్‌తో పాటు ఉపసర్పంచ్ పొన్నాల మణెమ్మ ట్యాంకర్, మరిన్ని ప్రైవేట్ ట్యాంకర్లను సంఘటనా స్థలానికి తరలించారు. గ్రామస్తులు, యువకులతో కలిసి మంటలను అదుపులోకి తెచ్చేందుకు కృషి చేశారు. అదే సమయంలో 101కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. సర్పంచ్ సమయస్ఫూర్తితో పెద్ద ప్రమాదం తప్పిందని, ఇళ్లు మరియు ధాన్యం నిల్వలు సురక్షితంగా ఉన్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఓయూ పాలక మండలి సభ్యులుగా ప్రొఫెసర్ నీరజ



**వేద న్యూస్,హైదరాబాద్:**

చారిత్రాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా సిటీ కళాశాల ఐక్యూయేసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.నీరజ ఎంపికయ్యారు. నీరజ సిటీ కళాశాల తెలుగు శాఖ ఆచార్యులుగా సేవలందిస్తున్నారు. సిటీ కళాశాలకు దేశంలోనే అత్యున్నతంగా ఏ ++ గ్రేడ్ సాధించటంలో ప్రొఫెసర్ నీరజ కీలక పాత్ర పోషించారు. కళాశాల విద్యాశాఖలో అకడమిక్ ఆఫీసర్ గా కూడా ప్రొఫెసర్ నీరజ విశేషమైన సేవలందించి ఉన్నతాధికారుల, అధ్యాపకుల ప్రశంసలందుకున్నారు. విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి దోహదపడే అనేక విద్యావిషయక ప్రణాళికలను రూపొందించటంలో, డిగ్రీ కళాశాల అభివృద్ధి విధానాల రూపకల్పనలో అకడమిక్ ఆఫీసర్ గా ఎంతో నిబద్ధతతో అంకిత భావంతో నీరజ కృషి చేశారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను, సమకాలీన అవసరాలను దృష్టిలో ఉంచుకొని సృజనాత్మక బోధనా నైపుణ్యంతో అధ్యాపకురాలిగా కూడా నీరజ బృహత్తరమైన పాత్ర పోషించారు. గత సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం వారి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం కూడా నీరజ అందుకున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, అంబేద్కర్ విశ్వవిద్యాలయ పాఠ్య ప్రణాళిక సభ్యులుగా వ్యవహరించారు. విమర్శకురాలిగా, పరిశోధకురాలిగా అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. సంపాదకురాలిగా, అనువాదకురాలిగా మరెన్నో విలువైన గ్రంథాలను వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ, వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన జాతీయ అంతర్జాతీయ సదస్సులో 30కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. సంచాలకులుగా ప్రతిష్టాత్మకమైన జాతీయ సదస్సులు నిర్వహించారు. విశేషమైన బోధనానుభవంతో పాటు సమర్ధవంతమైన పాలనానుభవం ఉన్న ప్రొఫెసర్ నీరజ పాలక మండలిసభ్యులుగా ఎంపిక కావటం పట్ల సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# వెంకట్రావుపేటలోనే మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- ప్రిన్సిపాల్ డా. కే. వెంకయ్య స్పష్టీకరణ
- విద్యార్థులు దోస్త్ ద్వారా అడ్మిషన్లు పొందాలని పిలుపు

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రస్తుతం వెంకట్రావుపేట గ్రామంలోనే కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకయ్య స్పష్టం చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని విఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు తొమ్మిది సంవత్సరాల క్రితమే ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాలను వెంకట్రావుపేటకు తరలించామని, అయితే ఈ విషయం ఇంకా చాలా మందికి తెలియడం లేదని తెలిపారు. ప్రస్తుతం "దోస్త్" ద్వారా అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, ఇంటర్మీడియట్, వొకేషనల్, ఓపెన్ ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో



ఆర్డీవో జీ. నరసింహారావు, ఎమ్మార్వో నీతూ, ఇన్‌చార్జి ఎంపీడీవో మహేశ్వర్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం గట్ల అశోక్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శరత్ కుమార్, డాక్టర్ అంకిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి మంచి స్పందన లభించింది.

# అనారోగ్యంతో ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలి

- తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాద్రీ
- మానవీయ కోణంలో పునర్వ్యవస్థీకరణకు విజ్ఞప్తి



**వేద న్యూస్, కరీంనగర్:**

జనగణన సర్వేకు సంబంధించి ఎన్యూమరేషన్ డ్యూటీల కేటాయింపులో అసమానతలు ఉన్నాయని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసి యేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. ఖాద్రీ పేర్కొన్నారు. కొంతమందికి డ్యూటీలు రాకపోవడం, మరికొందరికి రెండు చోట్ల డ్యూటీలు రావడం వంటి సమస్యలపై పునరాలోచన అవసరమని అధికారులను విజ్ఞప్తి చేశారు. అనారోగ్య కారణాల వల్ల డ్యూటీలు చేయలేని వారికి మినహాయింపు ఇవ్వాలని, వారి స్థానంలో డ్యూటీలు చేయడానికి సిద్ధంగా ఉన్న వారికి అవకాశం కల్పించాలని సూచించారు. డ్యూటీలు రాని వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సమానంగా బాధ్యతలు కేటాయించాలని కోరారు. డ్యూటీలు చేయాలనే ఉత్సాహం ఉన్నవారికి అవకాశం ఇవ్వాలని, చేయలేని వారిని బలవంతం చేయకుండా మానవీయ కోణంలో వ్యవహరించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్నవారు విధులు నిర్వర్తించలేకపోతే సర్వే నాణ్యత దెబ్బ తింటుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున శిక్షణ సమయంలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, డ్యూటీల కేటాయింపులో పారదర్శ కత పాటించాలని ఖాద్రీ కోరారు.

# వృద్ధురాలి హంతకుడి అరెస్ట్



- పింఛన్ డబ్బుల కోసం ఘాతుకం
- వివరాలు వెల్లడించిన పోలీసులు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్‌లో సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన వివరాలను డీఎస్పీ నాగేంద్రచారి మీడియా సమావేశంలో వెల్లడించారు. జగిత్యాల జిల్లాకు చెందిన గడీల రాజు (55) సిరిసిల్లలో కూలీ పనులు చేస్తూ నివాసం ఉంటున్నాడు. మద్యం వ్యసనంతో డబ్బుల కోసం అదే ప్రాంతంలో ఒంటరిగా నివసిస్తున్న కోన లక్ష్మి (75)పై దాడి చేయాలని పథకం వేసుకున్నాడు.ఈ నెల 13న మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి చొరబడి నగదు దొంగిలించే ప్రయత్నంలో వృద్ధురాలు మేల్కొని అరవడంతో, నిందితుడు కత్తెరతో గొంతు, మెడపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం బంగారు పోగుల కోసం ఆమె చెవులను కత్తిరించి తీసుకెళ్లాడు. ఆధారాలు నశింపజేయడానికి రక్తపు మరకలున్న బట్టలను తగలబెట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీటీవీ ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.2,000 నగదు, హత్యాయుధం కత్తెర, రెండు చీరలు, బ్యాంకు పాస్‌బుక్స్, ఆరోగ్యశ్రీ కార్డు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు.

# నవ్వుల వెనుక కన్నీళ్ల సాక్షి



## "శతాబ్దపు నిశ్శబ్ద గళం – మానవత్వపు మహాకావ్యం "చార్లీ చాప్లిన్"

**వేద న్యూస్ డెస్క్:**

మానవ చరిత్రలో యుద్ధాలు జరిగినప్పుడు ఆయుధాలు శబ్దం చేశాయి. కానీ, ఒక మౌన యోధుడు మాత్రం కేవలం తన సైగలతో, నవ్వుతో ప్రపంచాధిపత్య కాంక్షను, నియంతృత్వాన్ని గడగడలాడించాడు. ఆయనే చార్లీ చాప్లిన్. ఏప్రిల్ 16న ఆయన పుట్టినరోజు. ప్రపంచం దుఃఖంలో ఉన్నప్పుడు నవ్వించడం ఒక ఎత్తైతే, ఆ నవ్వు ద్వారా ఆలోచింపజేయడం చాప్లిన్ ప్రత్యేకత. ఒక నల్లని టోపీ, చేతిలో కర్ర, వింతైన నడక.. ఇవి కేవలం ఒక వేషధారణకు సంబంధించిన గుర్తులు కావు. అవి ఒక నిరుపేద ఆర్తికి, ఒక సామాన్యుడి ధిక్కారానికి చిహ్నాలు. శతాబ్దపు నిశ్శబ్ద గళం చార్లీ చాప్లిన్ పుట్టినరోజు సందర్భంగా, ఆయన నవ్వుల వెనుక దాగిన సామాజిక సత్యాలను ఎంతోకొంత తరిమిచూడాల్సిన అవసరం ఉంది". చాప్లిన్ జీవితం ఒక తెరిచిన పుస్తకం, కానీ అది కన్నీళ్లతో తడిసిన పుటలు కలిగినది. లండన్‌లోని మురికివాడల్లో కటిక పేదరికం, మానసిక స్థితి సరిగా లేని తల్లి, ఇవన్నీ ఆయనను కుంగదీయలేదు. బదులుగా, సమాజంలోని అట్టడుగు వర్గాల కష్టాలను అర్థం చేసుకునేలా చేశాయి. ఆయన సృష్టించిన 'ది ట్రాంప్' పాత్ర కేవలం ఒక బఫూన్ కాదు. అది ఆకలికి, ఆశకు, ఆత్మాభిమానానికి నిలువుటద్దం. చాప్లిన్ సృష్టించిన " ది ట్రాంప్' పాత్రలో ఒక విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తుంది. అతను కోటు వేసుకుంటాడు కానీ అది చిరిగిపోయి ఉంటుంది. చేతిలో కర్ర పట్టుకుంటాడు. అది ఒక హోదాకు సంకేతం, కానీ అతను ఒక యాచకుడు. సమాజం ఎంతగా తృణీకరించినా, తన ఆత్మాభిమానాన్ని వదులుకోని ఒక మధ్యతరగతి లేదా పేదవాడి మనస్తత్వానికి ఆ పాత్ర ప్రతిబింబం. నడకలో తడబాటు ఉన్నా, మనసులో దృఢత్వం కలిగిన ఈ పాత్ర ద్వారా, "గౌరవం అనేది ధనంలో లేదు, వ్యక్తిత్వంలో ఉంది" అని చాప్లిన్ నిరూపించారు. చాప్లిన్ కేవలం హాస్యనటుడు మాత్రమే కాదు, గొప్ప రాజకీయ విమర్శకుడు కూడా. ది గ్రేట్ డిక్టేటర్ తో హిట్లర్ రాక్షస పాలనను ఎండగడుతూ ఆయన తీసిన ఈ చిత్రం అప్పట్లో ఒక సంచలనం. అడాల్ఫ్ హిట్లర్ ఎదుగుతున్న సమయంలో, ప్రపంచ దేశాలు మౌనంగా ఉన్నప్పుడు, చాప్లిన్ తన సొంత ఖర్చుతో ఈ సినిమా తీశారు. హిట్లర్, చాప్లిన్ ఇద్దరూ ఒకే నెల, ఒకే ఏడాది (ఏప్రిల్ 1889) పుట్టారు. హిట్లర్ తన మీసాలను భయం పలకడానికి ఉపయోగిస్తే, చాప్లిన్ అవే మీసాలను హాస్యం ద్వారా నియంతృత్వాన్ని ఎండగట్టడానికి ఉపయోగించారు. మోడరన్ టైమ్స్ లో పారిశ్రామిక విప్లవం మనిషిని ఒక యంత్రంలా ఎలా మార్చేస్తుందో ఈ సినిమా అద్భుతంగా చూపిస్తుంది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ మనిషి తన అస్తిత్వాన్ని ఎలా కోల్పోతున్నాడో చాప్లిన్ ముందే హెచ్చరించారు. "అద్దం నా ఉత్తమ స్నేహితుడు, ఎందుకంటే నేను ఏడ్చినప్పుడు అది ఎప్పుడూ నవ్వదు". "ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు, మన కష్టాలతో సహా". "నువ్వు కిందికి చూస్తూ ఉంటే, ఎప్పటికీ ఇంద్రధనస్సును చూడలేవు". "నేను వర్షంలో నడవడానికి ఇష్టపడతాను, ఎందుకంటే నా కన్నీళ్లు ఎవరికీ కనిపించవు". అన్న చార్లీ చాప్లిన్ మాటలు నేటి సమాజానికి సందేశంగానే చూడాలి. నేడు ద్వేషం, యుద్ధం, అసహనం రాజ్యమేలుతున్న కాలంలో చాప్లిన్ 'మార్గం' అత్యంత అవసరం. ఆయన మార్గం కేవలం నవ్వించడం కాదు. మనిషిని ప్రేమించడం. కన్నీళ్లను తుడుస్తూనే, అన్యాయంపై మౌనంగానే గొంతెత్తడం. ఆయన దృష్టిలో నవ్వు అంటే కేవలం సరదా కాదు. "నిజమైన హాస్యం అనేది తీవ్రమైన బాధ నుండి పుడుతుంది" అని ఆయన నమ్మేవారు. తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న పేదరికాన్ని, తల్లి అనారోగ్యాన్ని ఆయన తెరపై హాస్యంగా మార్చారు. అంటే, సమస్యలను చూసి కుంగిపోవడం కంటే, వాటిని చూసి నవ్వగలిగే శక్తిని సంపాదించుకోవడమే చాప్లిన్ మనకు చూపిన మార్గం. కమ్యూనిజం ఆరోపణలతో అమెరికా ఆయనను దేశం నుండి వెళ్లగొట్టినప్పుడు కూడా ఆయన తన సిద్ధాంతాలను వదులుకోలేదు. తన పుస్తకంలో "నేను ఏ వర్గానికీ చెందినవాడిని కాను, నేను కేవలం మానవత్వానికి మద్దతుదారుడిని" అని స్పష్టం చేశారు. టాకీ సినిమాలు (మాటలు వినిపించే సినిమాలు) వచ్చాక కూడా చాప్లిన్ చాలా కాలం మూకీ సినిమాలకే మొగ్గు చూపారు. భాష అనేది మనుషులను విడదీస్తుందని, కానీ భావం ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఒకటేనని ఆయన నమ్మారు. అందుకే ఆయన సినిమాలు అమెరికా నుంచి ఆసియా లోని పల్లెల వరకు అందరికీ అర్థమయ్యాయి. మాటలు లేని చోట ఆయన కళ్లు, చేతులు సామాజిక అన్యాయాలపై గొంతెత్తాయి. ఇది ఒక అంతర్జాతీయ భాషను సృష్టించిన గొప్ప ప్రయోగం. బ్లాక్ అండ్ వైట్ తెరపై రంగుల కలలను పండించిన ఆ మహానుభావుడికి నివాళి అర్పించడమంటే.. మన చుట్టూ ఉన్న వారి కళ్లల్లో ఆనందాన్ని నింపడమే. చార్లీ చాప్లిన్ భౌతికంగా లేకపోయినా, ఒక సామాన్యుడు వ్యవస్థను ప్రశ్నించిన ప్రతిసారీ ' ది ట్రాంప్' రూపంలో ఆయన జీవించే ఉంటారు. నేటి ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యాంత్రిక జీవనం వైపు వేగంగా వెళ్తోంది. సరిగ్గా వందేళ్ల క్రితమే చాప్లిన్ 'మోడరన్ టైమ్స్' ద్వారా హెచ్చరించారు "మనుషులు యంత్రాలు కాకూడదు. 'ఏప్రిల్ 16న మనం చాప్లిన్‌ను గుర్తుచేసుకోవడమంటే.. మనలోని మనిషిని, సాటి మనిషి పట్ల ఉండే కరుణను గుర్తుచేసుకోవడమే. ఆయన చిరునవ్వు వెనుక ఉన్న కన్నీటిని అర్థం చేసుకున్నప్పుడే, ఆయన కళకు మనం ఇచ్చే అసలైన గౌరవం.

రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్
rajenderdamera@mail.com

# గంజా మత్తు!



- చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి రవాణా
- యువతే లక్ష్యంగా కొనసాగుతున్న దందా
- నిరుద్యోగులను వలలోకి లాగుతున్న స్మగ్లర్లు
- యువ భవిష్యత్తును నాశనం చేస్తున్న మహమ్మారి
- మూడు నెలల్లోనే 27 కేసులు నమోదు
- కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రజల డిమాండ్

**వేద న్యూస్, కరీంనగర్:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా చాపకింద నీరులా విస్తరిస్తూ యువతను మత్తు బారిన పడేస్తున్న పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. యువకులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఈ దందా కొనసాగుతోంది. ఈ గంజాయి మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా వారి జీవితాలను చిదిమేస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో యువకులు, కార్మికులు, నిరుద్యోగులు ఈ మత్తు వలలో చిక్కుకోవడం ఆందోళనకరం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి సరఫరా పెరుగుతుండటం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోంది. కేవలం మూడు నెలల్లోనే 27 గంజాయి కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. స్మగ్లర్లు గుట్టుచప్పుడు కాకుండా తమ కార్యకలాపాలను విస్తరించుకుంటూ డబ్బు ఆశ చూపించి నిరుద్యోగ యువతను రవాణా, విక్రయాల్లోకి దింపుతున్నారని సమాచారం. కొంతమంది విద్యార్థులు కూడా ఈ మత్తు పదార్థాల బారిన పడుతున్నారనే అంశం మరింత కలవరపెడుతోంది. పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ స్మగ్లర్ల చతురత ముందు అవి సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పటిష్ట నిఘా లోపం కారణంగా అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడం కష్టంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గంజాయి నియంత్రణపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విద్యాసంస్థలు, కార్మిక వర్గాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అనుమానాస్పద కదలికలపై కఠినంగా వ్యవహరించడం ద్వారా మాత్రమే ఈ మత్తు దందాకు అడ్డుకట్ట వేయగలమని నిపుణులు సూచిస్తున్నారు.


## ఆర్థశాస్త్రంలో వెంకటేష్ కు డాక్టరేట్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

శాతవాహన విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు వి. వెంకటేష్ కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. "ఇంపాక్ట్ అఫ్ రైతుబంధు ఆన్ ఫార్మర్స్ -ఏ కేస్ స్టడీ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్ట్" అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంధానికి డాక్టరేట్ ప్రధానం చేసినట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్. సురేష్ కుమార్ తెలిపారు. వెంకటేష్ అర్థశాస్త్ర విభాగపు అధిపతి డాక్టర్.కే .శ్రీవాణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ అవార్డును పురస్కరించుకొని విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్. పి. సతీష్ కుమార్, విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కె. పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ అబ్రర్, డాక్టర్ జాఫర్ జరీ , డీన్ ఫ్యాకల్టీ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్. ఎం. వరప్రసాద్, డాక్టర్ సరసిజా అతన్ని ప్రత్యేకంగా అభినందించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు,పరిశోధకులు మరియు విద్యార్థిని విద్యార్థులు అతనికి శుభాకాంక్షలు తెలియజేసినారు.

## జ్యూస్ అని చెప్పి నాలుగేళ్ల బాలుడికి యాసిడ్ తాగించిన పిన్ని

**వేద న్యూస్ హైదరాబాద్ :**



జ్యూస్ అని చెప్పి నాలుగేళ్ల బాలుడికి యాసిడ్ తాగించిన అమానవీయ ఘటన బోడుప్పల్ పరిధిలో చోటు చోటు చేసుకుంది. బోడుప్పల్‌కు చెందిన నాగరాజు, సంధ్యల కొడుకు కార్తీక్(9)పై నాగరాజు సోదరుడి భార్య మంజుల తన మామకు కార్తీక్ అంటేనే ప్రేమ ఎక్కువ అనే అసూయతో జ్యూస్ అని చెప్పి యాసిడ్ తాగించింది. మంజుల గతంలోనూ తన కొడుకుపై హత్యాయత్నం చేసిందని, మంజులపై బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మసాలా ఆహారం అతిగా తింటే కలిగే అనారోగ్య సమస్యలు




- జీర్ణక్రియపై మసాలాల ప్రభావం
- గుండె మంట మరియు అల్సర్ల ముప్పు
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు

**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుత కాలంలో చాలా మంది రుచికరమైన మరియు కారంగా ఉండే మసాలా ఆహారాలకు అలవాటు పడుతున్నారు. ముఖ్యంగా భారతదేశంలో బిర్యానీలు, కూరల్లో మసాలాల వినియోగం చాలా ఎక్కువ. అయితే ఈ ఆహారాలు నాలుకకు రుచిని అందించినప్పటికీ, వీటిని అతిగా తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఇబ్బందులు కలుగుతాయి. మసాలాలలో ఉండే రసాయనాలు చర్మంపై మరియు జీర్ణ వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. వీటి వల్ల కడుపులో మంట, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.మసాలా ఆహారాలను తరచుగా తీసుకోవడం వల్ల కలిగే ప్రధాన సమస్య గుండె మంట . కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు కడుపులో యాసిడ్స్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, అవి ఆహార నాళంలోకి రావడం వల్ల ఛాతీలో మంటగా అనిపిస్తుంది. ఇది దీర్ఘకాలంలో గ్యాస్ట్రిక్ సమస్యలకు దారితీస్తుంది. అలాగే కడుపులోని సున్నితమైన పొర దెబ్బతినడం వల్ల అల్సర్లు ఏర్పడే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మసాలా ఎక్కువగా ఉండే భోజనం చేయడం వల్ల నిద్రలేమి సమస్యలు కూడా తలెత్తుతాయి.మసాలా ఆహారం వల్ల కేవలం జీర్ణ వ్యవస్థే కాకుండా చర్మం కూడా దెబ్బతింటుంది. శరీరంలో వేడి పెరగడం వల్ల ముఖంపై మొటిమలు, బ్లాక్ హెడ్స్ మరియు చర్మం పొడిబారడం వంటి సమస్యలు వస్తాయి. చర్మ రంధ్రాలు మూసుకుపోయి నూనె ఉత్పత్తి పెరగడం వల్ల ముఖ సౌందర్యం దెబ్బతింటుంది. అధికంగా మసాలాలు తీసుకునే వారిలో ఒత్తిడి మరియు చిరాకు కూడా ఎక్కువగా ఉంటుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకే చర్మ ఆరోగ్యం కోసం మసాలాలను సాధ్యమైనంత వరకు తగ్గించడం మంచిది. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో సమతుల్యత పాటించడం చాలా ముఖ్యం. మసాలాలకు బదులుగా సహజసిద్ధమైన అల్లం, వెల్లుల్లి, పసుపు వంటి వాటిని పరిమితంగా వాడుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అతిగా కారం తినే అలవాటు ఉన్నవారు క్రమంగా దానిని తగ్గించుకోవాలి. భోజనంతో పాటు పెరుగు లేదా మజ్జిగ తీసుకోవడం వల్ల కడుపులో మంట తగ్గుతుంది. మసాలా ఆహారం తిన్న తర్వాత తగినంత నీరు తాగడం వల్ల శరీరంలోని విషతుల్యాలు బయటకు వెళ్లిపోతాయి.ప్రతిరోజూ మసాలా ఆహారానికి దూరంగా ఉంటూ వారానికి ఒకసారి మాత్రమే పరిమితంగా తీసుకోవడం ఉత్తమం. పండ్లు, కూరగాయలు మరియు తక్కువ నూనెతో చేసిన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. బయట దొరికే జంక్ ఫుడ్ మరియు మసాలా స్నాక్స్ తగ్గించడం వల్ల బరువు పెరగకుండా ఉండటమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చు. మన ఆహారమే మన ఆరోగ్యానికి మూలం కాబట్టి, రుచి కంటే ఆరోగ్యానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## వేసవి తాపాన్ని తరిమికొట్టే అమృతం తాటి ముంజలు

**వేద న్యూస్ డెస్క్:**



వేసవి కాలం ప్రారంభం కావడంతో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. ఈ ఎండల నుండి ఉపశమనం పొందేందుకు ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన ఫలం తాటి ముంజలు. ఐస్ యాపిల్స్‌గా పిలవబడే ఇవి కేవలం రుచికరమైనవి మాత్రమే కాకుండా, శరీరానికి అవసరమైన చల్లదనాన్ని అందిస్తాయి. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఇవి ఇప్పుడు విరివిగా లభిస్తున్నాయి. కృత్రిమ పానీయాల కంటే తాటి ముంజలు తీసుకోవడం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. తాటి ముంజలలో నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది వేసవిలో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుతుంది. వీటిలో పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీరంలోని నీటి నిల్వలను సమతుల్యం చేస్తాయి. ఎండలో తిరగడం వల్ల వచ్చే నీరసం, అలసటను తగ్గించడంలో ఇవి తక్షణ శక్తిని ఇస్తాయి. అంతేకాకుండా, ముంజలలో విటమిన్ ఎ, బి-కాంప్లెక్స్ మరియు సి ఉండటం వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక ఉత్తమ వేసవి ఆహారం.జీర్ణక్రియను మెరుగుపరచడంలో తాటి ముంజలు అద్భుతంగా పనిచేస్తాయి. ఎండాకాలంలో సాధారణంగా వచ్చే అసిడిటీ, మలబద్ధకం మరియు కడుపులో మంట వంటి సమస్యలను ఇవి దూరం చేస్తాయి. ముంజల మీద ఉండే లేత పొట్టులో పీచు పదార్థం అధికంగా ఉంటుంది, దీనిని తినడం వల్ల పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. గర్భిణీ స్త్రీలు ముంజలను తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత ఇబ్బందులు తగ్గడమే కాకుండా శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి. ఇది ఒక సహజ సిద్ధమైన కూలెంట్‌గా పనిచేసి కడుపును ప్రశాంతంగా ఉంచుతుంది. చర్మ సౌందర్యాన్ని సంరక్షించడంలో కూడా తాటి ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి. వేసవిలో వచ్చే చెమటకాయలు, దద్దుర్లు మరియు దురదలను నివారించడానికి ముంజల లోపల ఉండే నీటిని చర్మంపై రాసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి సహజమైన మెరుపును అందిస్తుంది. ఎండకు కమిలిన చర్మాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి ముంజల గుజ్జు ఎంతగానో ఉపయోగపడుతుంది. మొటిమల సమస్య ఉన్నవారు కూడా వీటిని తీసుకోవడం వల్ల రక్తం శుద్ధి జరిగి చర్మం ఆరోగ్యంగా మారుతుంది. మార్కెట్లో తాటి ముంజలను కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరం. మరీ ముదిరిపోయిన ముంజల కంటే లేతగా ఉండే వాటిని ఎంచుకోవడం మంచిది. ముదిరిన ముంజలు అరగడం కష్టంగా ఉంటుంది మరియు కొన్నిసార్లు కడుపునొప్పికి దారితీయవచ్చు. తాజా ముంజలను కొన్న వెంటనే తినడం వల్ల వాటిలోని పోషకాలు మనకు పూర్తిగా అందుతాయి. ఈ వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్‌కు బదులుగా ప్రకృతి సిద్ధంగా లభించే ఈ తాటి ముంజలను ఆస్వాదిస్తూ మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

## బెండకాయతో మేలు ఆరోగ్యాన్ని రక్షించే అద్భుత ఔషధం


**వేద న్యూస్ డెస్క్:**



బెండకాయ కేవలం రుచికరమైన కూరగాయ మాత్రమే కాదు, ఇది అపారమైన పోషక విలువలు కలిగిన ఒక సూపర్ ఫుడ్. ఇందులో విటమిన్ ఏ, సి, కే మరియు బి-కాంప్లెక్స్‌తో పాటు మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. బెండకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, వారంలో కనీసం రెండు సార్లు బెండకాయను ఆహారంలో చేర్చుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చు. ముఖ్యంగా శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలనుకునే వారికి ఇది ఒక సరైన ఎంపికగా చెప్పవచ్చు. మధుమేహంతో బాధపడేవారికి బెండకాయ ఒక వరమనే చెప్పాలి. బెండకాయలో ఉండే ఫైబర్ రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది. అధ్యయనాల ప్రకారం, బెండకాయ ముక్కలను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయాన్నే ఆ నీటిని తాగడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలోకి వస్తాయి. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి, రక్తంలో గ్లూకోజ్ అకస్మాత్తుగా పెరగకుండా చూస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో కూడా బెండకాయ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే పీచు పదార్థం మలబద్ధకం సమస్యను నివారించి, ప్రేగుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. గుండె సంబంధిత సమస్యలను దూరం చేయడంలో బెండకాయ అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే 'పెక్టిన్' అనే పదార్థం శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా రక్తనాళాల్లో పూడికలు ఏర్పడకుండా అడ్డుకుని, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే రక్తపోటు (బిపి) సమస్యతో బాధపడేవారికి ఇందులో ఉండే పొటాషియం ఎంతో ప్రయోజనకరం. గుండె పనితీరును మెరుగుపరచడమే కాకుండా, రక్త ప్రసరణ సాఫీగా జరిగేలా చేస్తుంది. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారు తమ డైట్‌లో దీనిని నిరభ్యంతరంగా చేర్చుకోవచ్చు. గర్భిణీ స్త్రీలకు బెండకాయ ఎంతో మేలు చేస్తుంది, ఎందుకంటే ఇందులో ఫోలేట్ (విటమిన్ బి9) పుష్కలంగా ఉంటుంది. ఇది పిండం ఎదుగుదలకు మరియు నాడీ సంబంధిత లోపాలు తలెత్తకుండా ఉండటానికి చాలా అవసరం. కంటి చూపును మెరుగుపరచడంలో కూడా బెండకాయ సహాయపడుతుంది; ఇందులో ఉండే బీటా కెరోటిన్ మరియు లూటిన్ వంటి పోషకాలు కంటి శుక్లాలు మరియు ఇతర చూపు సమస్యల నుండి రక్షణ కల్పిస్తాయి. చర్మ ఆరోగ్యాన్ని మరియు జుట్టు ప్రకాశాన్ని పెంచడంలో కూడా ఇందులోని విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది. వయసు పెరగడం వల్ల వచ్చే ముడతలను తగ్గించడంలో ఇది సహకరిస్తుంది.మొత్తానికి బెండకాయ ప్రతి నాణ్యమైన మరియు లేత బెండకాయలను ఎంచుకోవడం ద్వారా పూర్తి స్థాయి ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. లోతైన పోషకాహార అవగాహనతో బెండకాయను భాగం చేసుకుంటే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుంది.

# షూ కంపెనీ నుంచి ఏఐ దిశగా భారీ మలుపు..

**వేద న్యూస్ డెస్క్:**




అమెరికాకు చెందిన ప్రముఖ షూ బ్రాండ్ ఆల్‌బర్డ్స్ ఊహించని విధంగా తన వ్యాపార దిశను పూర్తిగా మార్చుకుంటూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలోకి అడుగుపెట్టనున్నట్లు ప్రకటించింది. 'న్యూబర్డ్ ఏఐ' పేరుతో రీబ్రాండ్ అవుతూ టెక్నాలజీ రంగంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనుంది. ఈ ప్రకటనతో మార్కెట్లలో సంచలనం రేగగా, కంపెనీ షేరు ధర ఒక్కసారిగా దాదాపు 600 శాతం ఎగబాకడం గమనార్హం. ఇప్పటివరకు పర్యావరణహిత స్నీకర్ల తయారీలో గుర్తింపు పొందిన ఈ సంస్థ, ఇకపై ఏఐ ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. ముఖ్యంగా ప్లాట్‌ఫామ్, క్లౌడ్ సేవలు వంటి రంగాల్లో అడుగుపెట్టి అధిక పనితీరు గల కంప్యూటింగ్ అవసరాలను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సుమారు 50 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించే ప్రణాళికను కూడా ప్రకటించింది. అయితే ఈ మార్పు వెనుక సంస్థ ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు సుమారు 4 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన ఈ కంపెనీ, ఇటీవల భారీ పతనాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలోనే కొత్త అవకాశాల కోసం ఏఐ రంగాన్ని ఎంచుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మార్కెట్లు ఈ ప్రకటనపై ఉత్సాహంగా స్పందించినప్పటికీ, నిపుణులు మాత్రం జాగ్రత్త అవసరమని సూచిస్తున్నారు. టెక్నాలజీ, డేటా సెంటర్లు, సరఫరా వంటి రంగాల్లో అనుభవం లేకపోవడం సంస్థకు సవాలుగా మారవచ్చని చెబుతున్నారు. ఒక పాదరక్షల కంపెనీ ఒక్కసారిగా హైటెక్ రంగంలోకి మారడం అరుదైన పరిణామమని, దీర్ఘకాలంలో ఈ వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో చూడాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగాడ మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా వ్యాపార మార్పులు చేపట్టిన ఆల్‌బర్డ్స్ నిర్ణయం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈ ప్రయాణం విజయవంతమవుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది.

# పెరగనున్న మందుల ధరలు?



**వేద న్యూస్ డెస్క్:**

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు ఆరోగ్య రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు దెబ్బతినడంతో పాటు ముడి పదార్థాల కొరత ఏర్పడటం వల్ల మందుల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా ఫార్మా కంపెనీలు ఉపయోగించే ఏపీఐ (ఆక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్) దిగుమతులు తగ్గిపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనికి తోడు రవాణా ఖర్చులు భారీగా పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో మందుల ధరలను పెంచేందుకు అనుమతి ఇవ్వాలని ఫార్మా సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ అంశంపై నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ మరియు కేంద్రం మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలంగా స్పందిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ధరల పెంపుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వొచ్చని తెలుస్తోంది. ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు ఉపయోగించే మందులతో పాటు ఇతర అత్యవసర ఔషధాల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇది రోగులు మరియు మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారాన్ని మోపే ప్రమాదం ఉంది. అయితే ఈ ధరల పెంపు శాశ్వతం కాదని సమాచారం. ముడి పదార్థాల సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు, సుమారు మూడు నెలల కాలానికి మాత్రమే ఈ పెంపును పరిమితం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశముంది. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత మళ్లీ పాత ధరలే అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మొత్తంగా ప్రపంచ రాజకీయ పరిస్థితులు ఇప్పుడు ఆరోగ్య రంగానికీ ప్రభావం చూపుతున్నాయి. మందుల ధరల పెరుగుదల సామాన్యులకు మరో సవాలుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# వాట్సాప్‌లో కొత్త ఫీచర్.. పర్సనల్, బిజినెస్ చాట్స్ వేర్వేరు!

**వేద న్యూస్ డెస్క్:**




ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ వినియోగదారుల కోసం మరో ఉపయోగకరమైన ఫీచర్‌ను తీసుకురానుంది. 'ఆటో-ఆర్గనైజ్ బిజినెస్ చాట్' అనే ఈ కొత్త ఆప్షన్ ద్వారా వ్యక్తిగత చాట్స్, వ్యాపార చాట్స్‌ను వేర్వేరుగా సర్దుబాటు చేసే అవకాశం కలుగనుంది. ప్రస్తుతం చాలా మంది యూజర్లు బిజినెస్ ఖాతాల నుంచి వచ్చే ప్రకటనలు, ప్రమోషనల్ మెసేజ్‌ల వల్ల తమ ముఖ్యమైన పర్సనల్ చాట్స్ మిస్ అవుతున్నాయని ఫిర్యాదు చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఈ కొత్త ఫీచర్ పనిచేయనుంది. ఇకపై బిజినెస్ అకౌంట్ల నుంచి వచ్చే సందేశాలు ఆటోమేటిక్‌గా ఒక ప్రత్యేక ఫోల్డర్‌లోకి వెళ్లిపోతాయి. అయితే, ఈ ఫీచర్‌లో ప్రత్యేకత ఏమిటంటేడ ఏదైనా బిజినెస్ మెసేజ్ వచ్చిన వెంటనే అది తొలగిపోదు. మొదటి 24 గంటల పాటు అది మీ మెయిన్ చాట్ లిస్ట్‌లోనే కనిపిస్తుంది. దీంతో మీరు ఆ మెసేజ్‌ను గమనించే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత ఆ చాట్ ఆటోమేటిక్‌గా బిజినెస్ సెక్షన్‌కు మారిపోతుంది. ఈ ఫీచర్ ద్వారా యూజర్ల ఇన్‌బాక్స్ మరింత క్లీన్గా మారుతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో చేసే చాట్స్ మాత్రమే ప్రధానంగా కనిపిస్తాయి. స్పామ్ మెసేజ్‌ల గోల కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్‌లో పరీక్ష దశలో ఉంది. త్వరలోనే అన్ని వినియోగదారులకు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. మొత్తానికిడ ఈ కొత్త ఫీచర్ వాట్సాప్ వినియోగాన్ని మరింత సులభంగా, క్రమబద్ధంగా మార్చనుంది.

# చెన్నైకు షాక్...ఖలీల్ గాయం.

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026లో ఐదుసార్లు ఛాంపియన్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్‌కు పెద్ద దెబ్బ తగిలింది. జట్టు కీలక ఎడమచేతి వేగ బౌలర్ ఖలీల్ అహ్మద్ తొడ కండరాల గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని జట్టు యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. చెపాక్ మైదానంలో కోల్‌కతా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఖలీల్ గాయపడ్డాడు. తన ఓవర్ వేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుడి కాలు పట్టేయడంతో మైదానంలోనే కుప్పకూలిపోయాడు. మొదట స్వల్ప గాయమని భావించినా, తర్వాత అది తీవ్రమైన కండరాల గాయంగా తేలింది. దీంతో అతను మ్యాచ్‌ను మధ్యలోనే వదిలి బయటకు వెళ్లాల్సి వచ్చింది. ఖలీల్ గాయంతో ఆ ఓవర్‌లో మిగిలిన బంతులను మరో బౌలర్ పూర్తి చేశాడు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించగా, పూర్తిగా కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వైద్యులు సూచించారు. దీంతో ఈ సీజన్‌కు అతను దూరమయ్యాడని జట్టు స్పష్టం చేసింది. జట్టుకు కీలకమైన ఈ దశలో ప్రధాన బౌలర్ గాయపడటం చెన్నైకు ఆందోళన కలిగిస్తోంది. ప్లేఆఫ్స్ రేసు సమీపిస్తున్న తరుణంలో ఖలీల్ లేకపోవడం జట్టు బౌలింగ్ బలాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కమిన్స్ రాకతో ఎస్ఆర్‌హెచ్‌కు ఊరట

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026లో మిశ్రమ ఫలితాలతో కొనసాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు భారీ శుభవార్త అందింది. జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గాయం నుంచి పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులో చేరేందుకు సిద్ధమయ్యాడు. వెన్ను గాయంతో బాధ పడుతున్న కమిన్స్ ఇటీవల ఆస్ట్రేలియాలో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడ చేసిన స్కానింగ్‌లో గాయం పూర్తిగా నయం అయినట్లు తేలింది. దీంతో త్వరలోనే అతను భారత్‌కు చేరుకుని జట్టుతో కలవనున్నాడు. ఈ నెల 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ తో జరిగే మ్యాచ్‌లో మైదానంలోకి తిరిగి దిగే అవకాశాలు ఉన్నాయి సీజన్ ప్రారంభానికి ముందే భారత్‌కు వచ్చిన కమిన్స్, కోల్‌కతా జట్టుతో జరిగిన మ్యాచ్ తర్వాత గాయం కారణంగా స్వదేశానికి వెళ్లాల్సి వచ్చింది. అతని గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించాడు. అతని సారథ్యంలో జట్టు ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలు సాధించింది ఇటీవల జరిగిన మ్యాచ్‌లో యువ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయం అందించారు. అయినప్పటికీ కెప్టెన్ కమిన్స్ తిరిగి రావడం జట్టు బౌలింగ్ బలాన్ని మరింత పెంచనుంది. అలాగే కెప్టెన్సీలోనూ స్థిరత్వం తీసుకురానుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో చెన్నై జట్టుతో జరగనున్న మ్యాచ్‌కు ముందు కమిన్స్ చేరడం ఎస్ఆర్‌హెచ్‌కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చే అంశంగా మారింది.

# క్రికెటర్లకు కాంట్రాక్ట్ శుభవార్త.. కొత్త అధ్యాయం ప్రారంభం

**వేద న్యూస్ డెస్క్:**



ప్రతిభావంతులైన యువ క్రికెటర్లకు ముంబై క్రికెట్ సంఘం శుభవార్త అందించింది. ఆర్థిక ఇబ్బందులతో పోరాడుతూ కూడా అద్భుత ప్రదర్శనలు చేస్తున్న ఆటగాళ్లకు బలమైన అండగా నిలవాలనే లక్ష్యంతో తొలిసారిగా కాంట్రాక్ట్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. దేశవాళీ స్థాయిలో కష్టపడి రాణిస్తున్న అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు ఇది పెద్ద ఊరటనిచ్చే నిర్ణయంగా భావిస్తున్నారు. ఈ కాంట్రాక్ట్ వ్యవస్థ ప్రధానంగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లకు వర్తించనుంది. ఆటగాళ్ల ఎంపికలో వారి ప్రదర్శన, ఫిట్‌నెస్ స్థాయి, అలాగే సెలెక్షన్ కమిటీ సిఫారసులు కీలకంగా ఉంటాయని సంఘం తెలిపింది. ఎంపికైన ఆటగాళ్లకు వార్షిక ప్రాతిపదికన పారితోషికం చెల్లించనున్నారు. ముఖ్యంగా ఈ విధానం పురుషులతో పాటు మహిళా క్రికెటర్లకు కూడా వర్తింపజేయడం విశేషం. ఇది మహిళా క్రికెట్ అభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని భావిస్తున్నారు. కాంట్రాక్ట్ విధానంలో భాగంగా ఆటగాళ్లను మూడు విభాగాలుగా విభజించనున్నారు. గ్రేడ్ ఏలో ఎంపికైన ఆటగాళ్లకు ఏడాదికి సుమారు రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పారితోషికం అందుతుంది. గ్రేడ్ బీ ఆటగాళ్లకు రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు, గ్రేడ్ సీ ఆటగాళ్లకు సుమారు రూ.8 లక్షల వరకు చెల్లించనున్నారు. ఇవి ప్రాథమిక చెల్లింపులు మాత్రమే కాగా, మ్యాచ్ ఫీజులు, అలవెన్సులు, అలాగే ప్రదర్శన ఆధారంగా ఇచ్చే అదనపు ప్రోత్సాహకాలు కూడా కొనసాగుతాయని సంఘం స్పష్టం చేసింది. ఈ విధానం ద్వారా ఆటగాళ్లకు ఆర్థిక భరోసా లభించడమే కాకుండా, వారు ఆటపై పూర్తిగా దృష్టి పెట్టే అవకాశం కలుగుతుంది. ఇప్పటివరకు అనేక మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఆర్థిక సమస్యల కారణంగా తమ కెరీర్‌ను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం వెల్లడించింది. ముంబై క్రికెట్ సంఘం అధ్యక్షుడు అజింక్య నాయక్ మాట్లాడుతూ, ఈ కాంట్రాక్ట్ వ్యవస్థ ముంబై క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. ఆటగాళ్లకు భరోసా కల్పించడం, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, ఫిట్‌నెస్ ప్రమాణాలను మెరుగు పరచడం, అలాగే పోటీ స్థాయిని పెంచడం ఈ నిర్ణయానికి ముఖ్య ఉద్దేశాలని ఆయన వివరించారు. ఈ కాంట్రాక్ట్ విధానం 2026-27 సీజన్ నుంచే అమల్లోకి రానుందని సంఘం వెల్లడించింది. దీంతో యువ క్రికెటర్లు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతారని విశ్లేషకులు భావిస్తున్నారు. దీర్ఘకాలంలో ఈ నిర్ణయం దేశవాళీ క్రికెట్ నాణ్యతను పెంచడమే కాకుండా, భవిష్యత్తులో జాతీయ జట్టుకు మరింత ప్రతిభావంతులైన ఆటగాళ్లను అందించే అవకాశం ఉందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తానికి, ముంబై క్రికెట్ సంఘం తీసుకున్న ఈ కీలక నిర్ణయం యువ క్రికెటర్ల భవిష్యత్తుకు బలమైన బాట వేయడమే కాకుండా, దేశవాళీ క్రికెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా నిలుస్తోంది.

# పేసర్ రూబెల్ వీడ్కోలు

**వేద న్యూస్ డెస్క్:**




బంగ్లాదేశ్ సీనియర్ పేసర్ రూబెల్ హొస్సేన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. కొన్ని రోజులుగా గాయాలతో బాధపడుతున్న ఆయన మూడు ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తన నిర్ణయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకున్నారు 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన రూబెల్, వన్డే తొలి మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు తీసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై నాలుగు వికెట్లు తీసి జట్టుకు గుర్తుండిపోయే విజయాన్ని అందించారు. బంగ్లాదేశ్ క్రికెట్ ఎదుగుదలలో ఆయన కీలక పాత్ర పోషించారు తన కెరీర్‌లో మొత్తం 159 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రూబెల్ 193 వికెట్లు సాధించారు. ఇందులో 27 టెస్టులు, 104 వన్డేలు, 28 టీ20లు ఉన్నాయి. వన్డేల్లో 129 వికెట్లు తీసి బంగ్లాదేశ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచారు. గాయాలు ఒకవైపు వేధిస్తుండడం, జాతీయ జట్టులో యువ ఆటగాళ్లు స్థిరపడటం మరోవైపు ఉండటంతో ఇదే సరైన సమయమని భావించి రిటైర్మెంట్ తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతానని వెల్లడించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 17, 2026

# చీరలో మెరిసిన అనికా



**వేద న్యూస్ డెస్క్:**

చైల్డ్ ఆర్టిస్టులుగా సినీ రంగంలో అడుగుపెట్టి, తర్వాత స్టార్ హీరోలు, హీరోయిన్లుగా ఎదిగిన వారు చాలా మంది ఉన్నారు. అదే జాబితాలో ఇప్పుడు అనికా సురేంద్రన్ కూడా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. చిన్న వయసులోనే తన సహజమైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు హీరోయిన్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి అందం, అభినయంతో యువతను ఆకట్టుకుంటోంది. 2007లో మలయాళ చిత్రసీమలో చైల్డ్ ఆర్టిస్టుగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన అనికా, తొలి రోజుల్లోనే తన ప్రతిభతో దర్శకుల దృష్టిని ఆకర్షించింది. తక్కువ కాలంలోనే పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించింది. తర్వాత తమిళ చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుని తన కెరీర్‌ను మరింత విస్తరించింది. ముఖ్యంగా అజిత్ కుమార్ కుమార్తెగా నటించిన చిత్రాలు ఆమెకు అపారమైన క్రేజ్ తెచ్చిపెట్టాయి. ఆ పాత్రల ద్వారా ఆమెకు 'కుట్టి' అనే ముద్దుపేరు రావడం, అభిమానులు ఆ పేరుతోనే ఆమెను పిలుచుకోవడం ఆమెకు లభించిన ప్రజాదరణకు నిదర్శనం. చిన్న వయసులో క్యూట్ నటిగా పేరు తెచ్చుకున్న అనికా, ఇప్పుడు హీరోయిన్‌గా తన ప్రతిభను కొత్త స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉంది. 18 ఏళ్లకే కథానాయికగా అవకాశాలు అందుకుని ప్రధాన పాత్రల్లో నటిస్తూ తన సామర్థ్యాన్ని నిరూపిస్తోంది. కథల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరిస్తూ, విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనలో వైవిధ్యాన్ని చూపిస్తోంది. ఇటీవల ఆమె నటించిన సినిమాలు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకోవడం, ఆమె కెరీర్‌కు కొత్త ఊపు తీసుకువచ్చింది. తెలుగు ప్రేక్షకులను కూడా 'బుట్ట బొమ్మ' చిత్రంతో పలకరించిన అనికా, తన నటనతో పాటు అందంతో కూడా మెప్పించింది. భాషల మధ్య గ్యాప్ లేకుండా వివిధ పరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ తన స్థాయిని పెంచుకుంటోంది. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ఈ యువ నటి, తరచూ తన ఫొటోలు, వీడియోలను పంచుకుంటూ అభిమానులతో సన్నిహితంగా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది మంది ఫాలోవర్లను సంపాదించుకుని, తన క్రేజ్‌ను మరింత విస్తరించుకుంటోంది. తాజాగా చీరకట్టులో ఆమె షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. సంప్రదాయ దుస్తుల్లో కనిపించినప్పటికీ ఆధునిక శైలిని కలగలిపి కనిపించిన ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సాధారణంగా చీరలో కనిపించినా, ఆమె హావభావాలు, పోజులు ఫొటోలకు ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చాయి. మినిమల్ మేకప్‌తో సహజ సౌందర్యాన్ని మెరుగుపరుచుకున్న అనికా, ఈ ఫొటోల్లో మరింత క్యూట్‌గా కనిపించడం విశేషం. అభిమానులు ఆమె ఫొటోలపై ప్రశంసల వర్షం కురిపిస్తూ, సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో అనికా తన ఫిట్‌నెస్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టింది. రెగ్యులర్ వర్కౌట్స్, డైట్ ఫాలో అవుతూ తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చుకుంటోంది. నటనతో పాటు గ్లామర్‌ను సమతుల్యంగా కొనసాగించడం ఆమె ప్రత్యేకతగా మారింది. భవిష్యత్తులో పెద్ద బ్యానర్లలో, స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి, చైల్డ్ ఆర్టిస్టుగా ప్రారంభమైన అనికా ప్రయాణం ఇప్పుడు హీరోయిన్‌గా కొత్త దిశలో వేగంగా ముందుకు సాగుతోంది. తన కృషి, ప్రతిభతో దక్షిణ భారత సినీ పరిశ్రమలో ప్రముఖ స్థానం సంపాదించే దిశగా అడుగులు వేస్తోంది. అందం, అభినయం కలగలిపిన ఈ యువ నటి రాబోయే రోజుల్లో మరింత పెద్ద విజయాలను అందుకుంటుందనే నమ్మకం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.


# 'పెద్ది' రిలీజ్ డేట్ ఇంకా సస్పెన్స్




**వేద న్యూస్ డెస్క్:**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేకపోవడం సినీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం జూన్‌లో విడుదల అవుతుందని ప్రకటించినప్పటికీ, ఖచ్చితమైన తేదీని వెల్లడించకపోవడం అభిమానుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. మొదట మార్చి 27న విడుదల కావాల్సిన ఈ చిత్రం షూటింగ్ ఆలస్యంతో వాయిదా పడింది. అనంతరం ఏప్రిల్ 30న విడుదల చేస్తామని ప్రకటించినా, ఆ తేదీ కూడా నిలవలేదు. తాజాగా మరోసారి వాయిదా వేస్తూ జూన్‌లో విడుదల చేస్తామని ప్రకటించిన చిత్ర బృందం, మంచి అవుట్‌పుట్ కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. అయితే డేట్ మాత్రం వెల్లడించలేదు. ఇప్పటికే రెండుసార్లు రిలీజ్ డేట్ మార్చుకోవడంతో, మళ్లీ తేదీ ప్రకటించి మారిస్తే ప్రేక్షకుల్లో నమ్మకం దెబ్బతింటుందనే ఆందోళనతోనే మేకర్స్ జాగ్రత్త పడుతున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అందుకే అన్ని విషయాలు ఖరారు అయిన తర్వాతే అధికారిక తేదీ ప్రకటించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జూన్ నెలలో విడుదలకు సిద్ధమవుతున్న యశ్ నటించిన 'టాక్సిక్' సినిమా కూడా 'పెద్ది' నిర్ణయంపై ప్రభావం చూపుతున్నట్లు సమాచారం. ఆ సినిమా జూన్ 4న విడుదల అవుతుందా లేదా అన్న అనిశ్చితి కొనసాగుతుండటంతో, దాని పరిస్థితిని బట్టి 'పెద్ది' రిలీజ్ డేట్‌ను ఖరారు చేయాలని భావిస్తున్నారట. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ రెండు సినిమాలు ఒకేసారి విడుదలైతే వసూళ్లపై ప్రభావం పడే అవకాశం ఉందని భావించి, సోలో రిలీజ్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏదేమైనా, 'పెద్ది' విడుదల తేదీపై పూర్తి క్లారిటీ రావాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే. అభిమానులు మాత్రం త్వరగా అధికారిక ప్రకటన రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'తస్సాదియ్యా' సాంగ్ విడుదల




**వేద న్యూస్ డెస్క్:**

అగ్ర కథానాయిక సమంత రుత్ ప్రభు నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' నుంచి ఫస్ట్ సాంగ్ 'తస్సాదియ్యా' విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన కొద్ది సేపటికే ఈ పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. సమంత తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆమె ఒక సాధారణ గృహిణిగా కనిపించబోతున్నప్పటికీ, కుటుంబాన్ని కాపాడుకునే బలమైన మహిళ పాత్రలో కనిపించనుంది. ఈ పాత్రలో సమంత నటన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం చెబుతోంది. తాజాగా విడుదలైన 'తస్సాదియ్యా' పాట పూర్తి ఉత్సాహంతో నిండిన ఫ్యామిలీ పార్టీ సాంగ్‌గా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అందించిన బాణీలు పాటకు ప్రధాన బలం కాగా, గాయని చిన్మయి శ్రీపాద తన స్వరంతో ప్రత్యేక ఆకర్షణ తీసుకువచ్చారు. ఈ పాటలో సమంత తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేస్తూ అభిమానులను అలరిస్తోంది. ఇక ఈ చిత్రం దర్శకురాలు బి.వి. నందినీ రెడ్డి తో సమంతకు ఇది రెండో సినిమా. ఇంతకు ముందు వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఓ బేబీ' భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఆ విజయానంతరం మళ్లీ ఈ కాంబినేషన్ రావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి కథను సమంత భర్త రాజ్ నిడిమోరు అందించడం మరో ప్రత్యేకత. కుటుంబ భావోద్వేగాలతో పాటు వినోదాన్ని కలగలిపిన కథతో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి 'తస్సాదియ్యా' పాట విడుదలతో 'మా ఇంటి బంగారం' చిత్రంపై భారీ హైప్ ఏర్పడింది. సమంత డాన్స్, సంగీతం, విజువల్స్ కలిసి ఈ పాటను సూపర్ హిట్‌గా మార్చేలా కనిపిస్తున్నాయి. సినిమా విడుదలకు ముందే ఈ పాటతో మంచి జోష్ నెలకొనడం చిత్ర యూనిట్‌కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.

# ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'..

**వేద న్యూస్ డెస్క్:**



ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి అడుగుపెట్టింది. థియేటర్లలో యావరేజ్ టాక్‌తో సరిపెట్టుకున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ డిజిటల్ వేదికపై ఎలా మెప్పిస్తుందో అన్న ఆసక్తి నెలకొంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం 'గబ్బర్ సింగ్' తర్వాత భారీ అంచనాలతో విడుదలైంది. ఇందులో శ్రీలీల హీరోయిన్‌గా నటించగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించింది. ప్రతినాయకుడిగా పార్థిబన్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉగాది సందర్భంగా మార్చి 19న విడుదలైన ఈ సినిమా ప్రారంభంలో మంచి హైప్ తెచ్చుకున్నప్పటికీ, కథలో బలహీనతల కారణంగా బాక్సాఫీస్ వద్ద మోస్తరు ఫలితంతోనే ముగిసింది. అయితే పవన్ కల్యాణ్ స్టైల్ యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ అభిమానులను మాత్రం ఆకట్టుకున్నాయి. హరీశ్ శంకర్ మార్క్ డైలాగులు, పాటలు కూడా ప్రేక్షకులకు నచ్చాయి. ఇక ఇప్పుడు ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక లో ఏప్రిల్ 15 అర్ధరాత్రి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, అలాగే పవన్ అభిమానులు ఈ సినిమాను ఓటీటీలో భారీగా చూసే అవకాశం ఉంది. సాధారణంగా మాస్ సినిమాలు డిజిటల్‌లో మరింత ఆదరణ పొందే ట్రెండ్ ఉండటంతో, ఈ చిత్రానికి కూడా మంచి వ్యూయర్‌షిప్ వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# ఘట్టమనేని వారసుడి ఎంట్రీ.. 'శ్రీనివాస మంగాపురం' టీజర్

**వేద న్యూస్ డెస్క్:**




శ్రీనివాస మంగాపురం టీజర్ విడుదలతో ఘట్టమనేని కుటుంబం నుంచి మూడో తరం హీరో ఎంట్రీపై సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. సూపర్ స్టార్ కృష్ణ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆయన పెద్ద కుమారుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ టీజర్‌ను సూపర్ స్టార్ మహేష్ బాబు విడుదల చేయడం మరింత హైప్ తీసుకొచ్చింది. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తిరుపతి నేపథ్యంలో సాగే గాఢమైన ప్రేమకథగా కనిపిస్తోంది. టీజర్‌లోని డైలాగులు, భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. హీరోగా పరిచయం అవుతున్న జయకృష్ణ మాస్, రస్టిక్ లుక్‌లో మెప్పించారు. స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీలో కుటుంబానికి చెందిన స్టైల్ కనిపిస్తోందని అభిమానులు స్పందిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రాషా తడాని టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. హీరోహీరోయిన్ కెమిస్ట్రీ టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ఈ సినిమాలో మోహన్ బాబు పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించడం ఆసక్తిని పెంచుతోంది. టీజర్ చివరలో ఆయన ఎంట్రీ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు బలం ఇచ్చింది.

# శ్రీముఖి రెమ్యునరేషన్ హాట్ టాపిక్

**వేద న్యూస్ డెస్క్:**

బుల్లితెరపై తన ప్రత్యేకమైన మాట తీరు, టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న యాంకర్ శ్రీముఖి ప్రస్తుతం అత్యంత డిమాండ్ ఉన్న మహిళా యాంకర్లలో ఒకరిగా నిలుస్తోంది. ప్రముఖ యాంకర్ సుమ కనకాల తర్వాత అదే స్థాయిలో క్రేజ్ సంపాదించిన యాంకర్‌గా ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. వినోదంతో పాటు చురుకుదనం కలగలిపిన ప్రెజెంటేషన్ ఆమెకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. టెలివిజన్ రంగంలో 'పటాస్' వంటి షో ద్వారా మంచి గుర్తింపు పొందిన శ్రీముఖి, ఆ తర్వాత వరుసగా రియాలిటీ షోలు, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలతో తన స్థాయిని మరింత పెంచుకుంది. తన చలాకీ నడవడి, చమత్కారమైన మాటలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ చిన్నతెరపై స్థిరమైన స్థానాన్ని సంపాదించింది. సినిమాల్లో కూడా కొన్ని ముఖ్యమైన పాత్రలు పోషిస్తూ తన నటనతో మంచి పేరు తెచ్చుకుంది. అలాగే రియాలిటీ షో 'బిగ్ బాస్'లో రన్నరప్‌గా నిలవడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా మారింది. ఆ షో ద్వారా ఆమెకు మరింత గుర్తింపు లభించడమే కాకుండా అభిమానుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అప్పటి నుంచి శ్రీముఖి క్రేజ్ మరింత పెరిగి, అవకాశాలు వరుసగా రావడం ప్రారంభమైంది. ప్రస్తుతం టీవీ షోలు, సినిమా ఈవెంట్లు, ప్రైవేట్ ఫంక్షన్లతో బిజీగా ఉన్న శ్రీముఖి, తన పాపులారిటీకి తగ్గట్టుగానే భారీ పారితోషికం అందుకుంటోంది. ఒక్కో టెలివిజన్ షో లేదా ఈవెంట్ కోసం ఆమె దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇది ఆమె మార్కెట్ స్థాయిని స్పష్టంగా తెలియజేస్తోంది. ఇక సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లు, ఆడియో ఫంక్షన్లకు హోస్ట్‌గా వ్యవహరించేందుకు కూడా ఆమెకు మంచి డిమాండ్ ఉంది. అలాంటి ఈవెంట్ల కోసం రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు పారితోషికం అందుకుంటోందని తెలుస్తోంది. పెద్ద సినిమాల ఈవెంట్లలో ఆమె హాజరు అవ్వడం ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆకర్షణగా మారుతోంది. నెలకు పలు టీవీ షోలు, అలాగే మూడు నుంచి నాలుగు సినిమా ఈవెంట్లు నిర్వహించడం వల్ల ఆమె నెలవారీ ఆదాయం సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఉంటుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్థాయిలో ఆదాయం సంపాదించడం ఆమె కెరీర్ ఎంత బలంగా ఉందో సూచిస్తోంది. ప్రస్తుతం ఈటీవీ, స్టార్ మా వంటి ప్రముఖ ఛానెళ్లలో పలు కార్యక్రమాలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న శ్రీముఖి, తన స్టైల్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతోంది. ఆమెకు ఉన్న క్రేజ్ దృష్ట్యా నిర్మాతలు, ఈవెంట్ నిర్వాహకులు కూడా భారీ పారితోషికం ఇవ్వడానికి వెనకాడడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి, తన ప్రతిభ, కష్టపాటు, నిరంతర శ్రమతో శ్రీముఖి చిన్నతెరపై అగ్రస్థానంలో నిలిచి, యాంకర్లలో ప్రత్యేక గుర్తింపుతో ముందుకు దూసుకెళ్తోంది.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073